శేరిలింగంపల్లి సర్కిల్‌లో వివిధ శాఖల అధికారుల ఫోన్ నెంబర్లు ఇవే..

రజనీకాంత్ రెడ్డి	డిప్యూటీ కమిషనర్	6309920618
అడ్మినిస్ట్రేషన్ విభాగం		
పి.నరేందర్‌రెడ్డి	ఏఎంసీ	9959442388
బి.ప్రేమ్ కుమార్	ఏఎంసీ	9915050844
పి.సంజయ్	ఇన్‌చార్జి ఏఎంసీ	9989930217
వి.శ్రవణ్‌కుమార్‌రెడ్డి	ఇన్‌చార్జి ఏఎంసీ	9866247052
ఎం.రామకృష్ణా రెడ్డి	ఇన్‌చార్జి ఏఎంసీ	9154899619
ఇంజినీరింగ్ విభాగం..		
వి.శ్రీనివాస్	ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్	9849906745
డి.రమేష్	డీఈఈ	9154299723
కె.విశాలాక్షి	డీఈఈ	9704405094
సీహెచ్.సునీల్ కుమార్	ఏఈ	7331170683
ఆర్.రమేష్	ఏఈ	7995079760
జగదీశ్వరుడు	ఏఈ	7995009092
టౌన్ ప్లానింగ్ విభాగం..		
కె.మెహ్రా	ఏసీపీ	9949994053
పి.రమేష్	డీఎం గ్రేడ్ 3	9440335574
కె.రవీందర్	టీపీఎస్	9849904836
శానిటేషన్ విభాగం..		
డాక్టర్ నగేష్ నాయక్	ఉపవైద్యాధికారి	9505085112
జలంధర్‌రెడ్డి	శానిటరీ సూపర్‌వైజర్	8790522488

ఘనంగా అయ్యప్ప పడి పూజ



పడిపూజలో పాల్గొన్న భక్తులు

రాయదుర్గం: అయ్యప్ప నామస్మరణతో రాజరాజేశ్వరినగర్ సీబ్లాక్ ప్రాంతం మార్మోగింది. కొండాపూర్ డివిజన్‌లోని రాజరాజేశ్వరినగర్ సీ–బ్లాక్‌లోని వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భార్గవ గురుస్వామి ఆశీస్సులు, విజయకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహాపడి పూజను నిర్వహించారు. అయ్యప్ప స్వామిని కొలుస్తూ అయ్యప్ప స్వాములు ఆలపించిన గీతాలు భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. ఈ సందర్భంగా కొండాపూర్ డివిజన్ యువజన నాయకులు ఆది ల్‌పటేల్, నాయకులు విజయకృష్ణ, మధుముదిరాజ్, శ్రీకాంత్‌గౌడ్, చిట్టిరాజుబాబు, రవిసాగర్, సూర్యనారాయణ, సత్యాందర్‌సింగ్, అజయ్‌సింగ్, శ్రీనివాసరావు, ప్రకాశ్‌రావు, శ్రీకర్, చౌదరి, పవన్, ప్రసాదరావు, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

అన్నపూర్ణకు 'మధుర కవి భూషణ' పురస్కారం

మియాపూర్: మేఘన సాహితి కళ వేదిక ఆధ్వర్యంలో ఆధునిక మహిళా కవి కాటేపల్లి అన్నపూర్ణకు మధుర కవి భూషణ పురస్కారాన్ని ప్రకటించారు. తెలుగు భాషలో ఆధునిక సామాజిక అంశాలపై రచనలు, కవులు, రచయిత్రులకు ఈ పురస్కారాన్ని అందజేస్తారు. మియాపూర్‌కు చెందిన అన్నపూర్ణ రచనల పేరిట 100కు పైగా లఘు కవితా మధురిమలను రచించినందుకు మధుర కవి భూషణ అని బిరుదును ప్రకటించినట్లు మేఘన సాహితి కళ వేదిక వ్యవస్థాపకులు సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి రఘునందన్ పేర్కొన్నారు. త్వరలో ఈ పురస్కారాన్ని అన్నపూర్ణకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

వినికిడి లోపానికి శాశ్వత పరిష్కారం

కూకట్‌పల్లి: వినికిడి లోపాల్ని రూపుమాపే కాక్లియర్ ఇంప్లాంటేషన్ అనే ఆధునిక శస్త్ర చికిత్స ప్రక్రియ మీద కేపీహెచ్‌బీలోని డాక్టర్ రావూస్ ఈఎన్‌టీ హాస్పిటల్‌లో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సుకు దేశవ్యాప్తంగా ఈఎన్‌టీ వైద్య రంగానికి చెందిన 100మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సులో ప్రీఫాండ్ హియరింగ్ లాస్ సమస్యతో బాధపడుతున్న కాక్లియర్ ఇంప్లాంటేషన్ అనే సర్జరీ ద్వారా వినికిడిని తిరిగి ప్రసాదించవచ్చని ఈ సదస్సుకి ప్రాతినిధ్యం వహించిన హాస్పిటల్ డైరెక్టర్ డా. రావూస్ పేర్కొన్నారు.

కాంగ్రెస్ బ్రోచర్ ఆవిష్కరణ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ ఆదివారం కాంగ్రెస్ పార్టీ బ్రోచర్, స్టిక్కర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లి సంక్షేమ పథకాలు అందరికీ అందేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానందనగర్ అధ్యక్షుడు బాషిపాక యాదగిరి, నాయకులు దుర్గారాణి, బస్వంత్ రాజ్, రమేష్, పరశురాములు, యాకయ్య, వెంకటేష్, దయాకర్‌రెడ్డి, కిషన్‌రావు, రాంనర్సయ్య, నాగుల మల్లేష్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ శారదాధామంలో జాతీయ విద్యా విధానం

బండ్లగూడ: విద్యార్థులకు ఉత్తమ విద్యాబుద్ధులు నేర్పిస్తు వారు విజ్ఞానవంతులుగా ఎదిగేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని హైదరాబాద్ హెచ్‌సీయూ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి బి.జగదీశ్వర్ రావు అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ శ్రీ శారదాధామంలోని శ్రీ సరస్వతీ విద్యాపీఠంలో జాతీయ విద్యా విధానంపై పాఠశాల విద్యకై కార్యప్రణాళిక కార్యశాలను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ హెచ్‌సీయూ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి బి.జగదీశ్వర్‌రావు హాజరై జ్యోతిప్రజ్వాలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యశాలలో విద్యా రంగంలో సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, అధికారులను భాగస్వామ్యం చేయడం అభినందనీయమన్నారు. జాతీయ విద్యావిధానం ద్వారా నూతన సాంకేతిక ప్రగతిని, రాబోవుతరానికి అందించి తన ప్రగతికి తానే బాటలు వేసుకునే విధంగా అవకాశం కల్పించడబడిందన్నారు. చక్కటి పౌరులుగా తీర్చిదిద్దడానికి జాతీయ విధానం మార్గం సుగమము చేస్తుందన్నారు. జాతీయ విలువలను పెంపొందించి, జాతీయ పౌరసత్వాన్ని అభివృద్ధి పరిచి ఒక పటిష్ఠమైన దేశంగా రూపాంతరం చెందడానికి, భారత యువతకు కావలసిన నైపుణ్యాలను వ్యక్తిత్వ విలువలను పెంపొందించే దిశగా జాతీయ విద్యా విధానం రూపొందించబడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ఎల్‌యూ(రిటైర్డ్) ప్రొఫెసర్ సుధాకర్, తిరుపతిరావు, డాక్టర్ చామర్తి ఉమామహేశ్వరరావు, శ్రీ సరస్వతీ పతకమూరి శ్రీనివాసరావు, ముక్కాల సీతారాములు, విద్యావేత్తలు తదితరులు పాల్గొన్నారు.

బన్సీలాల్‌నగర్ నూతన అసోసియేషన్ ఏర్పాటు

రాజేంద్రనగర్: బుద్వేల్ బన్సీలాల్‌నగర్‌లో ఆదివారం బన్సీలాల్‌నగర్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ కొత్త కమిటీ ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులుగా పి.మోహన్, ఉపాధ్యక్షులుగా దేవేందర్ వర్మ, జనరల్ సెక్రటరీగా సాయి మల్లిక్, కోశాధికారిగా రవి కుమార్, జాయింట్ సెక్రటరీగా సి.యాదయ్య, భాస్కర్, ఆర్గనైజింగ్ సభ్యులుగా చంద్రశేఖర్, అశ్ఫక్, సతీష్, వికాస్, దినేశ్, రాహుల్, సలహాదారులుగా సి.నాగరాజు, డి.రాజు, నాగమ్మ, కృష్ణ కుమార్, ఎన్నికయ్యారు.

సోలార్ ప్లాంట్ @ 10 ఏళ్లు!



లైబ్రరీ భవనంపై సోలార్ ప్లాంట్

- హెచ్‌సీయూ లైబ్రరీపై పదేళ్ల క్రితం ఏర్పాటు
- క్యాంపస్‌లో మొదటి సౌర విద్యుత్ ప్లాంట్
- దేశంలో సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసిన లైబ్రరీ భవనం కూడా ఇదే

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి ఎంతో చరిత్ర ఉంది. నాణ్యమైన విద్య అందించడంలో జాతీయ, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన విషయం అందరికీ తెలిసిందే. ఇంత ప్రాధాన్యత సంతరించుకున్న తరుణంలో విద్యుత్ వినియోగంలో దశలవారీగా స్వయం సమృద్ధి సాధించాలని నిర్ణయంతో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అనంతరం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో మొదటి సారిగా సౌర విద్యుత్ ప్లాంట్‌ను 2013లో ఏర్పాటు చేశారు. ఇప్పటికీ ఈ ప్లాంట్ విజయవంతంగా కొనసాగుతూ ఆ తర్వాత ఏర్పాటు చేసిన వాటికి మార్గదర్శకంగా మారింది. భారతదేశంలోనే 100 కేడబ్ల్యూ సౌర విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన మొదటి విశ్వవిద్యాలయ లైబ్రరీ కూడా ఇదే కావడం విశేషం.

1.14 మెగా వాట్ల సామర్థ్యంతో..

ఈ సౌర విద్యుత్‌ను క్యాంపస్ లోని ఎంతో ప్రాధాన్యత కలిగిన హెచ్‌సీయూ ఇందిరా గాంధీ మెమోరియల్ లైబ్రరీ భవనంపై రూఫ్‌టాప్ ప్లాంట్‌ను మొదటగా ఏర్పాటు చేశారు. ఈ మొదటి రూఫ్‌టాప్ సౌరవిద్యుత్ ప్లాంట్‌ను అప్పట్లో అప్పటి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రామకృష్ణ రామస్వామి చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రారంభించిన అనంతరం సోలార్ పవర్ ప్లాంట్ కంట్రోల్ రూమ్, రూఫ్‌టాప్ సోలార్ పవర్ ప్లాంట్ ఫలకాలను వీసీ రామకృష్ణరామస్వామి యూనివర్సిటీ అధికారులు, ఫ్యాకల్టీ ప్రతినిధులతో కలిసి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సోలార్ పవర్ ప్లాంట్ 1.14 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేశారు. ఈ సోలార్ పవర్ విద్యుత్ ప్లాంట్‌ను రికార్డు స్థాయిలో కేవలం 30 రోజులలో ఏర్పాటు చేయడం విశేషం.



సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ కంట్రోల్ రూమ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ రామకృష్ణరామస్వామి(ఫైల్)

రూ.14 లక్షల విద్యుత్ బిల్లు ఆదా..

సంవత్సరానికి 21,11,358 కిలో వాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి చేయాలని సంకల్పించారు. ఆ రోజుల్లోనే అంటే పదేళ్ల క్రితమే నెలకు రూ.14 లక్షల వరకు విద్యుత్ బిల్లు తగ్గుతుందని అంచనా వేశారు. క్యాంపస్‌లో లైబ్రరీ భవనాన్ని 1988 అక్టోబర్ 21న అప్పటి భారత ఉపరాష్ట్రపతి డాక్టర్ శంకర్ దయాళ్ శర్మ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం లైబ్రరీకి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పేరు పెట్టారు. లైబ్రరీ తన అంతర్గత కార్యకలాపాలన్నింటినీ కంప్యూటరీకరించిన మొదటి విశ్వవిద్యాలయ లైబ్రరీ. భారతదేశంలో ఎలక్ట్రానిక్ జర్నల్‌లు, డేటాబేస్‌లకు సభ్యత్వాన్ని పొందింది. పదేళ్లు గడిచినా ఇప్పటికీ విజయవంతంగా ఈ ప్లాంట్ కొనసాగడం విశేషం. ఇదిలా వుండగా ఆ తర్వాత మరిన్ని చోట్లకు విస్తరించే చర్యలు క్యాంపస్‌లో చేపట్టి కూడా విజయవంతమయ్యారు. రాబోయే రోజుల్లో పూర్తి స్థాయిలో సోలార్ పవర్ పైనే ఆధారపడాలని కూడా ప్రణాళికలతో ముందుకు సాగుతుందని ఆశిద్దాం.

శేరిలింగంపల్లి ప్రజలకు రుణపడి ఉంటా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి: ఎన్నికల్లో ఘన విజయాన్ని అందించిన శేరిలింగంపల్లి ప్రజలకు రుణ పడి ఉంటానని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అన్నారు. చందానగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యేగా మూడో సారి విజయం సాధించిన ఆరికెపూడి గాంధీకి ఆత్మీయ అభినందన సభ నిర్వహించి ఎమ్మెల్యేకు భారీ పూలమాలలు, శాలువాలతో పార్టీ కార్యకర్తలు, కాలనీలవాసులు సత్కరించారు. శేరిలింగంపల్లిని అన్ని విధాల అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే..

రాయదుర్గం: శేరిలింగంపల్లి మసీదుబండలోని ఆర్‌వీపాంచజన్య అపార్ట్‌మెంట్స్‌లో వైకుంఠ వేంకటేశ్వరస్వామి పద్మావతి సమేత దేవాలయం ఐదో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ నాయకులు గణేష్‌ముదిరాజ్, రాజుయాదవ్, రవియాదవ్, మల్లేష్, నగేష్‌గౌడ్, మల్లేష్‌యాదవ్, రాము శ్రీకాంత్, శశాంక్, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.



ఎమ్మెల్యే గాంధీని ఆశీర్వదిస్తున్న అర్చకులు

ఉత్సాహంగా స్పోర్ట్స్ ఫెస్ట్



క్రీడాంశాల్లో పాల్గొన్న చిన్నారులు

శేరిలింగంపల్లి: చందానగర్ పీజేఆర్ స్టేడియంలో బ్లాజమ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ స్పోర్ట్స్ ఫెస్ట్‌ను ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, స్కూల్ చైర్మన్ పవన్ కుమార్, డైరెక్టర్ కిరణ్‌కుమార్, హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్, బీఆర్ఎస్ డివిజన్ గౌరవ అధ్యక్షులు వీరేశం గౌడ్ హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ.. చిన్నారుల్లో సృజనాత్మకతను గుర్తించే ప్రోత్సహించే అవకాశం ఉపాధ్యాయులకు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహ పరిచే డ్యాన్స్‌లు చేశారు. అనంతరం వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజితారావు, మహేష్, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న నాగేందర్‌యాదవ్



నృత్యం.. మంత్రముగ్ధం

శిల్పారామంలో హైదరాబాద్ అస్సాం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బిహూనృత్యం, అస్సామీ సంగీతం, వైదేహి సుభాష్ శిష్య బృందం చే భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. జతిస్వరం, శబ్దం, దేవీస్తుతి, కౌతం, అష్టపది తదితర అంశాలు చూపరులను మంత్రముగ్ధుల్ని చేశాయి. –మాదాపూర్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శేరిలింగంపల్లి: చందానగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని తారానగర్ ఏఈ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చందానగర్ హుడా కాలనీ, పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరా ఉండదన్నారు.

రైల్ విహార్ ఫీడర్ పరిధిలో..

ఇంజినీర్స్ ఎన్‌క్లేవ్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ తెలిపారు. ఫీడర్ పరిధిలోని సాయిబాబ ఆలయం ఏరియా, సిటిజన్స్‌కాలనీ, శివాజీనగర్, గిద్దంగి ఏరియా, భారత్ పెట్రోల్ పంప్ వెనుక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నినిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు హెచ్‌సీయూలో నిరసన

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో స్టూడెంట్స్ యూనియన్ 2023–24 ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలుపుతున్నట్లు అధ్యక్షుడు ఎండీ అతీఖ్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏడు డిమాండ్లతో ఈ నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇటీవల హెచ్‌సీయూలో పనిచేసే ఇద్దరు ఉద్యోగులు మృతి చెందారని, వారి మృతిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుని, మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. ఇద్దరు ఉద్యోగుల కుటుంబాలకు న్యాయం చేసే వరకు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగిస్తామన్నారు.

అథ్లెటిక్స్ టీమ్ సెలక్షన్స్

బాలానగర్: జేఎన్‌టీయూ యూనివర్సిటీ హైదరాబాద్ అథ్లెటిక్స్ బాలురు, బాలికల టీమ్ సెలక్షన్స్ ఆదివారం నిర్వహించారు. హకీంపేటలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో జేఎన్‌టీయూ యూనివర్సిటీ పురుషుల, మహిళల సెలక్షన్ ట్రయల్ నిర్వహించారు. ఈ సెలక్షన్‌లో యూనివర్సిటీ విద్యార్థులతో పాటు యూనివర్సిటీ పరిధిలోని పలు ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు 120 మంది పాల్గొన్నారు. సెలక్షన్స్‌లో తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ చీఫ్ కోచ్ రతన్ బోస్ పాల్గొన్నారు. యూనివర్సిటీ క్యాంపస్ ఫిజికల్ డైరెక్టర్ డా. నల్లగొండ అశోక్, డా. దిలీప్ క్రీడాకారులను ఎంపిక చేశారు.

కేన్సర్ వ్యాధిగ్రస్తులకు అవగాహన

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఇనిస్టిట్యూట్‌లో ఫ్రెండ్స్ ఆఫ్ మాక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేన్సర్ సపోర్ట్ సమావేశం ఆదివారం నిర్వహించారు. కడుపులోని కేన్సర్ వ్యాధిగ్రస్తులతో సమావేశమయిన వైద్యులు వ్యాధి లక్షణాలు, చికిత్స పద్ధతులతో పాటు మనో ధైర్యం కలిగించేలా కౌన్సిలింగ్ నిర్వహించారు. కేన్సర్ అంటేనే గతంలో మరణం అనే విధంగా పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక చికిత్స కారణంగా కేన్సర్‌ను తగ్గించుకోగలమని సూచించారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఆఫ్ మాక్స్ ప్రోగ్రాం ఆఫీసర్ బీనా నారాయణ్, సుధా సామినేని, డాక్టర్ సెంథిల్ రాజప్ప, డాక్టర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎన్‌టీ వైద్య శిబిరానికి స్పందన

రహమత్‌నగర్: అక్బరి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బోరబండ డివిజన్ సైట్–1 అక్బరి మసీదులో ఆదివారం నిర్వహించిన ఉచిత ఈఎన్‌టీ వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. దాదాపు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రముఖ ఈఎన్‌టీ వైద్యులు ప్రొఫెసర్ బల్‌బీర్‌సింగ్‌తో పాటు ఆరుగురు ఈఎన్‌టీ వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సొసైటీ ఉపాధ్యక్షులు డాక్టర్ జుబైర్, జనరల్ సెక్రటరీ డాక్టర్ చాంద్‌పాషా, కోశాధికారి మహ్మద్ ఇషాక్ అహ్మద్ మాట్లాడుతూ... సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. ఎం.ఎ. సత్తార్, అబ్దుల్ రహీమ్ తౌఫీఖ్ పాల్గొన్నారు.

ఆల్ ఇండియా క్రాఫ్ట్ మేళాకు స్పందన



వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా క్రాఫ్ట్ మేళా సందర్శకులను ఆకట్టుకుంటుంది. ఆదివారం సెలవు రోజు కావడంతో నగరవాసులు సందర్శించి చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేశారు. డెవలప్‌మెంట్ ఆఫ్ కమిషనర్ హ్యాండ్లూమ్, మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్, ఆధ్వర్యంలో చేనేత హస్తకళా ఉత్పత్తులను ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. కశ్మీర్, కర్ణాటక, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్, వెస్ట్ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన హ్యాండ్లూమ్, జ్యూట్, టెర్రకోట తదితర ఉత్పత్తులను అందుబాటులో ఉంచారు.

ఐలమ్మ స్ఫూర్తితో పోరాడాలి



మాట్లాడుతున్న కుమారస్వామి

రాయదుర్గం: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ స్ఫూర్తితో రజకులు ఆత్మగౌరవంతో జీవిస్తూ, మన హక్కుల కోసం పోరాడి సాధించుకోవాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుంద్రకుమారస్వామి పేర్కొన్నారు. బొటానికల్ గార్డెన్‌లో శ్రీరామ రజక సంఘం ఆధ్వర్యంలో పానుగోటి సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన రజక సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రజకుల అభ్యున్నతికోసం జాతీయ బీసీ దళ్ ఎప్పటి నుంచో కృషి చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కుల వృత్తినే నమ్ముకున్న అనేక రజక కుటుంబాలు తమ రెక్కల కష్టం మీదే జీవనం సాగిస్తున్నాయన్నారు. ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా రజకులు కూడా ఆర్థిక, రాజకీయంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, సందీప్, లక్ష్మణ్, జానీ, వెంకన్న, ధర్మ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నిప్పంటించుకుని యువకుడి ఆత్మహత్య



పవన్ కళ్యాణ్ (ఫైల్)

మియాపూర్: ఇంటర్వ్యూ ఉందని వెళ్లిన ఓ యువకుడు ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పవన్ కళ్యాణ్ (25) మియాపూర్‌లోని డాల్ఫిన్ దుర్గాకాంటిలో ఉంటున్న అక్క వాసంతి, బావ అనుదీప్‌కుమార్ వద్ద ఉంటున్నాడు. ఐదేళ్ల క్రితం తమిళనాడులో బీటెక్ పూర్తి చేశాడు. అప్పటి నుండి ఇంట్లోనే ఖాళీగా ఉంటున్నాడు. ఏదైనా ఉద్యోగం చేయాలని తల్లిదండ్రులు చెబుతుండేవారు. ఈ నెల 14న ఇంటర్వ్యూ ఉందని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి రాత్రైనా ఇంటికి రాకపోవడంతో బావ అనుదీప్ కుమార్ మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మియాపూర్‌లోని దీప్తీశ్రీనగర్ వద్ద చెట్ల పొదల్లో ఓ యువకుడు ఒంటికి నిప్పంటించుకుని పడిఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం పూర్తిగా కాలిపోయి గుర్తుపట్టని స్థితిలో ఉంది. ద్విచక్రవాహనం సైతం కాలిపోయి ఉంది. ఇంజిన్ నంబర్ గుర్తించి విచారించగా అనుదీప్ కుమార్ పేరుపై ఉంది. పవన్ కళ్యాణ్ ఒంటికి నిప్పంటించుకుని మృతిచెందినట్లు పోలీసులు నిర్ధారించారు.

క్రీడల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: క్రీడలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో కేబీఎన్ యంగ్ స్టార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని చెప్పారు. ఆటగాళ్లను ప్రోత్సహించేందుకు ప్రతీ గ్రామంలో క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. అంతేకాకుండా పటాన్‌చెరు, అమీన్‌పూర్, జిన్నారంలలో మినీ స్టేడియాలు నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి

ఎన్నికల్లో తన విజయానికి సహకారం అందించిన అమీన్‌పూర్ మున్సిపల్ ప్రజలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తామని తెలిపారు. ఆదివారం పెద్ద చెరువు కట్ట సమీపంలో బీఆర్ఎస్ నాయకులు కాటా రాజేష్ గౌడ్ దంపతులు ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మునిసిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆకర్షణీయం.. అయ్యప్ప ఆలయం

- ప్రతి ఏటా ప్రత్యేక పూజలు
- నిత్యం భక్తుల కోలాహలం



జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి గ్రామంలో 15 ఏళ్ల క్రితం నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శబరిమలలోని స్వామి దేవాలయం తీరుగా ఆ ఆలయ నిర్మాణం ఉండడం ప్రత్యేకత. ప్రతి ఏటా ఆలయంలో వందల సంఖ్యలో భక్తులు అయ్యప్పను దర్శించుకుంటారు. వేలాది స్వాములు మాలధారణ చేస్తుంటారు. గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి గ్రామం హైదరాబాద్‌కు కేవలం 30 కిలోమీటర్ల దూరంలో ఉంది. గ్రామంలో అయ్యప్పస్వామి దేవాలయాన్ని 15 ఏళ్ల క్రితం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించారు. శబరిమల దేవాలయంలో ఉన్నట్టే 18 మెట్లు ఏర్పాటు చేయడం ప్రత్యేకత సంతరించుకుంది. ఈ ఆలయానికి దగ్గరలోనే శైవ క్షేత్రాల్లో ఒకటైన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయం కూడా ఉంది. ఆ ఆలయానికి సుమారు వెయ్యి ఏళ్ల చరిత్ర ఉంది.

సుమారు 1000 మంది మాల ధారణ..

ప్రతి ఏటా వెయ్యి మంది స్వాములు ఈ దేవాలయంలో అయ్యప్ప మాల ధరిస్తుంటారని అంచనా. ఆ సమయంలో సుమారు ఐదు వందల మంది స్వాములు ఈ ఆలయంలోనే ఉంటుంటారు. ప్రతినిత్యం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. అయ్యప్ప పూజ జరిగే ప్రతి ఏటా రెండు గద్దలు వచ్చి ఆకాశంలో సంచరిస్తుంటాయి. అది అద్భుతంగా చెప్పుకుంటారు. ఆలయం వద్దే సాయిబాబా, శివాలయాలు కూడా ఉన్నాయి. కనువిందు చేసే ఈ ఆలయాలు, పక్కనే ఉన్న చెరువు అందాలను భక్తులు ఆస్వాదిస్తుంటారు. స్థానికంగా ఉన్న పరిశ్రమలు, రాజకీయ నాయకులు, భక్తులు అందించే విరాళాలతో దేవాలయంతో పాటు పరిసర ప్రాంతాలను స్థానిక నాయకులు అభివృద్ధి చేస్తున్నారు.